



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 588 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 17 సోమవారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## విశాఖ అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా నిర్మిస్తున్న మాస్టర్‌ప్లాన్ రోడ్ల పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.విశాఖ నగరాభివృద్ధిలో భాగంగా వీఎంఆర్‌డీఏ చేపట్టిన 8 ఎంఐజీ ప్రాజెక్టులతో పాటు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

## ఏపీ అభివృద్ధి అంతా డొల్ల...



వైసీపీ అధినేత జగన్... సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ పూర్తిగా విఫలమైందని, ఆదాయం పడిపోతూ అప్పులు భారీగా పెరుగుతున్నాయని ఆరోపించారు. కాగ్ (%జూ+%) విడుదల చేసిన తాజా గణాంకాలను ఉటంకిస్తూ ఆయన ట్వీట్ చేశారు. "2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన గణాంకాలు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో చాలా నిరుత్సాహకరమైన వృద్ధిని వెల్లడిస్తున్నాయి.




## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 16 : భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. 21న మధ్యాహ్నం 1:10 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్‌కు రాష్ట్రపతి చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30గంటలకు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయనున్నారు. సాయంత్రం 3:25 గంటల వరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్‌భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు. సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల వరకు భారతీయ కళా మహోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 6:15 గంటలకు తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. రాత్రి రాజ్‌భవన్‌లో బస చేయనున్నారు. 22వ తేదీ ఉదయం 9:30గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పుట్టపర్తికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బయలుదేరనున్నారు.






## సమాన ఓటు హక్కు అంబేడ్కర్ ఇచ్చిన వరం


**-భారత్‌ను ప్రపంచంలో నంబర్ 1 చేయాలని మోదీ కృషి చేస్తున్నారు**

**-సీజేఐ జస్టిస్ గవాయ్ గొప్ప వ్యక్తి అని కొనియాడిన సీఎం**

**- 2047 నాటికి భారతీయులు ఉన్నత స్థాయికి చేరతారని ధీమా**

ఒకప్పుడు చాయ్‌వాలాగా జీవితం ప్రారంభించిన నరేంద్ర మోదీ ఈరోజు దేశానికి ప్రధానమంత్రి కాగలిగారంటే అందుకు కారణం భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాలేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం - 75 సంవత్సరాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తాను ముఖ్యమంత్రిగా, జస్టిస్ గవాయ్ సీజేఐగా, జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏపీ హైకోర్టు సీజేగా తమ విధులను నిర్వర్తిస్తున్నామంటే అదంతా రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశమేనని పేర్కొన్నారు.






# నేటి పత్రికలు... నాటి ఆనవాళ్లు...

ఒక ఊరు, ఒక జిల్లా, ఒక రాష్ట్రం, ఒక దేశం ఇలా ఒక ప్రాంతం గురించి, ఆ ప్రాంతంలో జరుగుతున్న విశిష్టతలు, మార్పులు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయం, చదువు, ప్రభుత్వం చేస్తున్న పనులు, ప్రతిపక్షాల దుష్ప్రచారాలు, ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాయాలు, ఆవేశంతో తీసుకున్న నిర్ణయాలు, పేదవాడి నుంచి పెద్ద పెద్ద భవనాలలో బతుకుతున్న బలా జాదుగాడి వరకు, అనేక వార్తలను ప్రచారం చేస్తూ ఇంటింటి గుమ్మాన్ని తాకుతూ, ఎంతో జ్ఞానాన్ని జనాల మెదళ్లలోకి పంపిస్తుంది వార్తాపత్రిక.

అప్పట్లో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉన్నా, లోకాన ఏం జరుగుతుంది అని తెలుసుకోవడం కోసం, కాస్త చదువుకున్న పిల్లాడిని పక్కన కూర్చోబెట్టుకుని , పంచాయతీల దగ్గర, ఊరు మధ్యలో ఉన్న మర్రి చెట్టు కింద పెద్దవారు పిల్లాడు చెప్తుంటే వార్తలు వినేవారు.

తొలి పొద్దుకాకముందే అందంగా ముస్తాబయి, సైకిల్ స్టాండ్ లో కూర్చుని, ఊరూరా తిరుగుతూ అన్ని ఊర్లలోని విశేషాలను అందరికీ అందించేది దినపత్రిక.

- పేర్లు కూడా అనేకమే

దినపత్రిక
వారపత్రిక
పక్షపత్రిక
మాసపత్రిక
వార్షిక పత్రిక

ఆదివారం రోజున సండే బుక్స్, స్వాతి బుక్స్, నెల నెలా మ్యాగజైన్స్ అనేకానేక రకాలుగా, అనేక వినోదాలను తనలో నింపుకుని, సినిమా బొమ్మలు, అనేక ఆటలు, రాజకీయాల గురించి, దేశాలు దాటెల్లి ఆడుతున్న ఆటగాళ్ల గురించి, అనేక రుచుల గురించి, వాటిని తయారు చేసుకునే విధానం గురించి, ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, సమాజాన జరుగుతున్న పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం కోసం అన్ని రకాల సమాచారాలు ఐదారు పేపర్లలో క్లుప్తంగా ముద్రించేవారు.

నాగరికత అంచెలంచలుగా పెరుగుతున్న క్రమంలో వార్తాపత్రిక ఆన్లైన్ ప్లాట్ఫారం మీద కొత్త రూపాంతరాన్ని చేజిక్కించుకుంది. విందులు వినోదాలతో పాటు పత్రికల సంఖ్య కూడా అనేకంగానే పెరిగింది. కొత్త కొత్త సాహిత్య సంస్థలు,అనేక రాజకీయ పార్టీల పత్రికలు, ఇలా చెప్పుకుంటూ పోతే సాహిత్యం కోసం కొన్ని పత్రికలు ఉంటే, రాజకీయం కోసం మరికొన్ని, విద్యార్థుల పోటీ పరీక్షల కోసం కొన్ని పత్రికలు ఉంటే, ఆంగ్లాన్ని అనర్గళంగా నేర్చుకోవడం కోసం ఇంకొన్ని, ఊరూరా తిరిగే పత్రికలు కొన్ని అయితే, చరవాణిలో బంధింపపడ్డ పత్రికలు ఇంకొన్ని, ఏ పత్రిక అయినా సమాచారాన్ని ఇవ్వడం కోసమే, కాస్త మేధోసంపత్తి పెంచుకోవడం కోసమే, రోజుకో గంట సమయాన్ని పెట్టి చదివితే, ఎంతో సులభంగా ప్రభుత్వ ఉద్యోగం మీ వెంట. ఒకటవ తరగతి నుంచి డిగ్రీ వరకు, క్లర్క్ నుంచి కలెక్టర్ వరకు

ఆశ ఏదైనా ఆశయం ఒక్కటే, అనుసరించాల్సిన పద్ధతి ఒక్కటే, దానికి మూలమే వార్తాపత్రిక, ఎందరో జీవితాలను మార్చింది, మరెందరినో మేధావులుగా తీర్చిదిద్దింది, ఎందరికో ఆసరాగా నిలబడింది, జర్నలిజానికి నిజాన్ని చూపించడానికి దిక్సూచి అయ్యింది. అక్షరాలు తనువు నిండా నింపుకుని జ్ఞాన సరస్వతిగా మారి అందరి చేతుల్లో వాలింది.

మారుతున్న పరిస్థితులు, అభివృద్ధి చెందుతున్న సామాజిక అంశాలు, రోబోట్ లు ఉద్యోగం చేస్తున్న ఈ యుగంలో ఇంకా దినపత్రికలు చదువుతున్న వారు ఉన్నారు అంటే ఎంతో గొప్ప విషయమనే చెప్పాలి. పత్రికను నడుపుతున్న వారికి, సమాచారాన్ని సేకరించి టైపింగ్ చేస్తున్న వారికి, ఆ కష్టాన్ని వృధా కానివ్వకుండా రోజూ పత్రికలు చదువుతున్న వారికి అందరికీ జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు...



**పోలగాని భానుతేజశ్రీ గౌడ్** MBA

# ఏపీ అభివృద్ధి అంతా డొల్ల...

తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు వేగంగా పెరుగుతాయని టీడీపీ, జనసేన ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది.టీడీపీ కూటమి ప్రభుత్వ ఆర్థిక పనితీరును ఒక్కసారి పరిశీలిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంలో గతేడాదితో పోలిస్తే కేవలం 7.03 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు వినియోగానికి అద్దం పడతాయి. ఈ రెండింటి ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం గతేడాది ఇదే సమయంతో పోలిస్తే కేవలం 2.85 శాతం మాత్రమే పెరిగింది.గత రెండేళ్ల (2023-24 నుంచి 2025-26) మొదటి అర్ధభాగంలో రాష్ట్ర సొంత పన్ను రాబడి వార్షిక వృద్ధి రేటు (%జూ+=%) కేవలం 2.75 శాతంగా ఉంది. ఇది మరింత ఆందోళన కలిగించే విషయం. అయినా, రాష్ట్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని చంద్రబాబు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. 2024-25లో 12.02 శాతం, 2025-26లో 17.1 శాతం జీఎస్డీపీ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని వారు చెబుతున్నారు. ఈ స్థాయిలో వృద్ధి ఉంటే పన్నుల రాబడి కూడా 12 శాతం నుంచి 15 శాతం వరకు పెరగాలి. కానీ వాస్తవ వృద్ధి కేవలం 2.75 శాతం మాత్రమే. మరోవైపు, మూలధన వ్యయం గత రెండేళ్లలో మైనస్ 16 శాతం వార్షిక వృద్ధి రేటుతో క్షీణించడం మరింత బాధాకరం.2019-24 మధ్య ఐదేళ్లలో రాష్ట్ర సొంత పన్ను రాబడి ఏటా సగటున 9.87 శాతం పెరిగింది. జీఎస్డీపీ వృద్ధి 10.23 శాతంగా నమోదైంది. ఆ గణాంకాలకు, ఇప్పటి వృద్ధికి పొంతన లేదు. మరి ఇంత తక్కువ రాబడి వృద్ధితో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు ఎలా చెప్పగలరు?ఈ ప్రభుత్వ హయాంలో వేగంగా దూసుకుపోతున్నది ఒక్క అప్పుల విషయంలోనే. ఇప్పటివరకు టీడీపీ కూటమి ప్రభుత్వం రూ. 2,06,959 కోట్లను అప్పుగా తీసుకుంది లేదా ఒప్పందాలు చేసుకుంది. ఇది గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో 62 శాతం అని గణాంకాలు చెబుతున్నాయి" అని జగన్ తన ట్వీట్ లో వివరించారు.

# విశాఖ అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష

నగరానికి ఐకాన్‌గా నిలిచేలా కైలాసగిరిపై 50 అంతస్తుల ఐకానిక్ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, కొత్తవలస వద్ద 120 ఎకరాల విస్తీర్ణంలో ఒక థీమ్ బేస్డ్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, జూన్ నెలాఖరు నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. విశాఖ మాస్టర్‌ప్లాన్ డిజైన్‌ను కూడా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ఆయన వివరించారు. నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు

# 6 మద్యం సీసాలతో పట్టుబడ్డ వ్యక్తి అరెస్ట్



భోగాపురం: భోగాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. రెండు మండలాల్లో ఎక్కడ గొలుసు దుకాణాలున్నా ఆ దుకాణాల పట్ల మరింత నిఘా వేసి తనిఖీలను విస్తృతం చేసారు. అనధికార మద్యం దుకాణాల ఏరివేతే లక్ష్యంగా ఎక్సైజ్ అధికారులు అనధికార మద్యం దుకాణాలపై (బెల్ట్ షాపులపై) దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో భాగంగా సవరివిల్లి గ్రామానికి చెందిన ఓ ఆసామి నుండి 6 మద్యం 180 ఎమ్ ఎల్ పరిమాణం గల బాటిల్స్ స్వాధీనం చేసుకొని, ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ ఎవరు అనధికార మద్యం షాపులు నిర్వహించరాదని ప్రోత్సహించరాదన్నారు. అనధికారి మద్యం దుకాణాలు (బెల్ట్ షాపులు) యొక్క సమాచారాన్ని భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వారికి తెలియజేయవలసిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడునన్నారు. ఈ దాడుల్లో సీఐ రవికుమార్, ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది ప్రతాప్ శిరీష పాల్గొన్నారు

# సమాన ఓటు హక్కు అంబేడ్కర్ ఇచ్చిన వరం

సీజేఐ జస్టిస్ గవాయ్‌పై చంద్రబాబు ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతం నుంచి వచ్చారని గుర్తుచేశారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ ఆయన ఎంతో నిరాడంబరంగా ఉంటారని, ఎల్లప్పుడూ సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. "జస్టిస్ గవాయ్ చాలా మంచి మనసున్న వ్యక్తి. ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే గొప్ప తీర్పులను ఆయన వెలువరించారు" అని చంద్రబాబు అన్నారు. భారతదేశ భవిష్యత్తుపై చంద్రబాబు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. "ప్రపంచంలోని అనేక దేశాలు యువత కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. కానీ, మన దేశంలో ఆ సమస్య లేదు. అపారమైన మానవ వనరులు మన సొంతం. సంస్కరణల తర్వాత ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అత్యంత ప్రభావశీల శక్తిగా ఎదుగుతారన్న నమ్మకం నాకుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సమాజంలో తప్పులు జరిగినప్పుడు వాటిని సరిదిద్ది, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఆధునిక కాలంలో సోషల్ మీడియా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ ఎడిటర్‌గా మారిపోతున్నారు. ఇష్టానుసారంగా వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి" అని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన 'ఒక వ్యక్తి- ఒక ఓటు' హక్కు ఒక గొప్ప వరమని చంద్రబాబు అభివర్ణించారు. "కొన్ని దేశాల్లో ఇప్పటికీ ప్రజలకు సమాన ఓటు హక్కు లేదు. కానీ, భారతదేశంలో పేద, ధనిక, స్త్రీ, పురుష బేధం లేకుండా అందరికీ సమాన ఓటు హక్కు ఉంది" అని ఆయన వివరించారు. సామాజిక, ఆర్థిక సమానత్వం ఉన్న సమాజాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ విధానాలు ఈ సమానత్వాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. "ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మించాలన్నదే నా ప్రణాళిక. ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం కోరుతున్నాను" అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు



# ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

**- గత ఏడాది కన్నా ఈ ఏడాది ఎక్కువ ధరకు కొంటున్నాం**

**- ఈ ఏడాది లక్ష్యం 4 వేల మెట్రి టన్నుల**

**- ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొండపల్లి**

- విజయనగరం: ప్రతి రైతు తన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం గజపతినగరం లో మంత్రి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూగత ఏడాది .... 3 లక్షల 34 వేలు టన్నులు ... కొనుగోలు చేసామని,

ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. కనీస మద్దతు ధర క్వింటాకు -కామన్ వెరైటీ రూ.2369/- గ్రేడ్ ఏ రూ. - 2389/ లు గా ఉంటుందని, ఇది గత ఏడాది కంటే 69 రుపాయలు ఎక్కువని తెలిపారు. ధాన్యం సేకరణ కు జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలను , 261 క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి రైతుసేవా కేంద్రం లో సేకరణకు అవసరమగు సామగ్రిని సిద్ధం చేయడం జరిగిందన్నారు. అలాగే గోనె సంచులు, వాహనాలను సిద్ధం చేయడం జరిగిందని, ఈ వాహనాలన్నీ జి.పి.ఎస్ పద్ధతి లో పని చేస్తాయని అన్నారు. 159 మిల్లులను గుర్తించడం జరిగిందని, వాటి సామర్ధ్యాన్ని బట్టి ధాన్యం సిద్ధం చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది ఆర్.ఎస్.కే లలో ఉండే తేమ యంత్రాలనే మిల్లుల వద్ద కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

జిల్లా స్థాయి లో 89789 75284 కాంట్రోల్ రూం ఏర్పాటు చేయడమైనదని, మండల స్థాయి లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసామని తెలిపారు. అలాగే సేకరణ పై 1967 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఏ ఒక్క రైతు కు నష్టం జరగకుండా సేకరణ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి పడాల అరుణ,జనసేన ఇంచార్జ్ సురేష్, ఏ. ఎం.సి చైర్మన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి పౌర పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి. శాంతి , జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీ, డి.సి.ఓ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, మార్క్ఫెడ్ డి.ఎం వెంకటేశ్వర రావు , తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓ లు, డి.టి లు , వి.ఆర్.ఓ లు, వి.ఆర్.ఏ లు, పాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# సి ఐ ఐ సదస్సు.... అభివృద్ధికి సీఎం తపస్సు



విజయనగరం:

విశాఖపట్నంలో జరిగిన సి ఐ ఐ సమ్మిట్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రాష్ట్ర మంత్రికొండపల్లి శ్రీనివాస్ ,ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు , ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ అండ్ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు ఈరోజు మీడియాతో మాట్లాడారు.

సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని, ముఖ్యంగా పరిశ్రమల పెట్టుబడుల పెంపునకు ఇది దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికవేత్తలకు అనుకూల విధానాలు, విశాఖను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రభుత్వ సంకల్పం గురించి వివరించారు. బంగార్రాజు మాట్లాడుతూ, ఈ సమ్మిట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అవకాశాలు తెరుచుకున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధికి కూడా పరిశ్రమల విస్తరణ కీలకమని, ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ స్థాయిలోనూ పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.సమ్మిట్ విజయవంతం కోసం కృషి చేసిన అధికారులకు, పారిశ్రామికవేత్తలకు, నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# గ్రంథాలయ ఉద్యమకారులకు ఘనంగా నివాళులు

తణుకు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 16 : గ్రంథాలయ ఉద్యమాన్ని గ్రామ, పట్టణ, నగరాల్లో వ్యాప్తి చేసిన మహానుభావులైన అయ్యంకి వెంకట రమణయ్య, డా.ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, వెలగా వెంకటప్పయ్య చిరస్మరణీయులని రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ మరియు సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కోట రామ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రోత్సహించిన వారి గురించి వివరించారు. సభలో ముందుగా ప్రముఖ న్యాయవాది, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి, కౌరు వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి అధ్యక్షత వహించారు. వావిలాల సరళాదేవి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి తమ జీవితాలను త్యాగం చేసిన మహానుభావులందరికీ మనం కృతజ్ఞులమై ఉండాలనీ, వారి స్ఫూర్తితో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకట రమణయ్య, డా.ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, వెలగా వెంకటప్పయ్య చిత్రపటాలకు వేదికను అలంకరించిన ప్రముఖులు, సభకు హాజరైన ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. సభలో మరో అతిథి న్యాయవాది, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌరు వెంకటేశ్వర్లు "రాజ్యాంగం - బాలల హక్కులు" అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. బాల బాలికలు స్వేచ్ఛగా జీవించే హక్కు, చదువుకునే హక్కు, సమానత్వపు హక్కు, భారత దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు రాజ్యాంగం కల్పించిందని వివరించారు. బాల బాలికలు తమ ఆపద సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేసి పోలీసు వారి రక్షణ పొందాలని తెలియజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, తణుకు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలబాలికలు గ్రంథాలయం సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని హితవు పలికారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు యం.ఉమాజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి గ్రంథ పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో చివరిగా ఈ సభలో ప్రసంగించిన ముఖ్య అతిథి కోట రామ ప్రసాద్, అతిథి కౌరు వెంకటేశ్వర్లులను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, తణుకు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, చీకటి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు మరియు వారి భార్య గుత్తికొండ స్రవంతి, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ






సభ్యురాలు యం.ఉమాజ్యోతి, ప్రముఖ కవి, రిటైర్డ్ తెలుగు పండితులు వి.ఎస్.వి.ప్రసాద్ ప్రభృతులు దుశ్శాలువాలతో సత్కరించారు. సభలో ఇంకా సభలో కెమిస్ట్ కె.శ్రీనివాస్, వేద గణిత ఉపాధ్యాయురాలు వి.లక్ష్మి దేవి, రికార్డ్ అసిస్టెంట్ చదువరులు, వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈనాటి కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సభలో సభాసదులను, విద్యార్థినీ విద్యార్థులను తమ నటనతో టీవీ మరియు సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్ అలరించారు. యం.ఉమాజ్యోతి వందన సమర్పణతో నాటి సభ ముగిసింది.

# ఐబొమ్మ, బప్పమ్ సైట్లను బ్లాక్ చేసిన పోలీసులు

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 16 : సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐబొమ్మ, బప్పమ్ వెబ్సైట్లను బ్లాక్ చేశారు. నిన్న రాత్రి నుంచి ఈ సైట్లు పూర్తిగా అందుబాటులో లేకుండా చేశారు. ఐబొమ్మ సైట్ ద్వారా 1ఎక్స్ బెట్ అనే ఆన్లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ని నిర్వాహకుడు ఇమ్మడి రవి ప్రమోట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సినిమాల కోసం వెతికే యూజర్లను బెట్టింగ్ వైపు మళ్ళించడం అతని టార్గెట్ అని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి రవి భారీగా నిధులు స్వీకరించినట్లు దర్యాప్తులో బయటపడింది.




# ఏడిద సీతానగరం రోడ్డులో ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం



మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 16 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపుతో తోట త్రిమూర్తులు ఆదేశంతో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం ఏడిద సీతానగరం రోడ్డులో వైఎస్ఆర్సీపీ నాయకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించడం వల్ల పేదలకు మధ్యతరగతి ప్రజలు తీవ్రమైనటువంటి నష్టం జరుగుతుందని, వారు వైద్య విద్య వైద్యానికి దూరమవుతారని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కురుపుడు భవాని రాంబాబు, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్, రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రెటరీ వాసిరెడ్డి అర్జున్, ఎంపీటీసీ పట్టణా నాగబాబు, తాతపూడి ఉష రాజేష్, నాయకులు పితాని నారాయణరావు, విసుప్పు రెడ్డి, శివ కొండేటి కాళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిధర్ రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం కోసం కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి విజయం సాధించిన తర్వాత మొదటి సారి జహీరాబాద్ విచ్చేసిన సందర్భంగా జహీరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి కి కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి సి సి ఉపాధ్యక్షులు ముల్తాన్ సీడిసి చైర్మన్ ముబీన్, జహీరాబాద్ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, యువ నాయకులు నాగిరెడ్డి ,హర్షవర్ధన్ రెడ్డి , నవాజ్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడాకారులను

# స్ఫూర్తిగా తీసుకోవాలి

నెల్లిమర్ల:

అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడలో మూడు రోజులు పాటు నిర్వహించిన 12వ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏపీ మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీలంశెట్టి లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నగరపంచాయతీ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, టిడిపి నాయకులు దంతులూరి అజయ్ బాబు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో విజయనగరం క్రీడాకారులు సత్తాచాటారు. ఉమెన్, మెన్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ సాధించారు. ఉమెన్స్ విభాగంలో బెస్ట్ వెయిట్ లిఫ్టర్ గా విజయనగరం జిల్లా కొండవెలగాడ క్రీడాకారిణి సుస్మిత నిలిచారు. అలాగే మెన్స్ విభాగంలో కడప జిల్లాకు చెందిన రవిశంకర్ బెస్టు లిఫ్టర్ గా సత్తా చాటారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించిన కొండవెలగాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం శుభపరిణామని చెప్పారు. త్వరలో గ్రామంలో ఏర్పాటు చేసిన జిమ్ ని పరిశీలించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సత్యజ్యోతి ఆత్మశాంతించాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు అట్టాడ లక్ష్మంనాయుడు, చల్లా రాము, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com